మనస్తత్వం : పరిశీలన

# ★ వెన్నెల! పండువెన్నెల!!

★

నేను కొత్తగా వుద్యోగంలో చేరిన రోజులవి.

ఆ తరగతి 'పిల్లలు' కాస్త సెంకివాళ్లని తెలిసి వుండడంచేత నేను తరగతి గదిలో జాగ్రత్తగానే కాలు పెట్టాను, మొదటి రోజున.

నేను తరగతిగదిలోకి వెళ్లగానే కొంత ఉత్కంఠతో గౌరవసూచకంగా నాకేసి చూస్తూ నిలబడ్డారు విద్యార్థులు. "కూర్చోండి" అని చెప్పి నా కుర్చీలో నేను కూర్చున్నాను. నిశ్శబ్దంగా వుంది వాతావరణం. కళ్లజోడు సరదుకుని చూస్తున్నాను, 'పిల్లల' వైపు. వాళ్ళుకూడా నన్ను పరిశీలిస్తున్నారు, ఎట్లాంటివాడా ఇతనని కాబోలు.

ఆ నూతన వాతావరణంలో నన్ను మొట్టమొదట ఆకర్షించింది ఒక మెరుపుతీగ. పదహారు వసంతాలుంటాయి. సోగకళ్లెత్తి చూస్తోంది నాకేసి. పచ్చని వొళ్ళూ, నున్నని చెక్కిళ్ళూ, ఎఱ్ఱని పెదవులూ! నా కళ్లు మిరిమిట్లు గొన్నాయి!

నేను కాస్త దృష్టిమార్చి సరదుకు కూర్చుని చెదిరిన గంభీరతని కూర్చుకుంటున్నాను.

హాజరు పిలవడం పూర్తయింది. ఆమె పేరు 'లలిత'! ఎంత చక్కటి పేరు అనిపించింది!

"ఎన్ని పాఠాలయ్యాయి యిదివరకు మీకు" అన్నాను.

"రెండు" ఎవడో కుఱ్ఱాడు జవాబిచ్చాడు.

"ఇంతే?"

"అంతేనండి"

"ఆ రెండు పాఠాలైనా సరిగ్గా బోధపడలేదండి," మరొకడు.

"రెండవ పాఠమైతే యేమీ తెలియలేదండి," ఇంకొకడు.

వెనక్కి లాగుతున్నారు.



ఈవారపు పెద్దగాథ:

బంకుపల్లి
రామజోగరావు

"మీరు మొదటినుంచీ చెప్పాలి మేష్టరుగారూ" పూర్తిగా వెనక్కిలాగాడు ఇతను.

నే నిట్లా ప్రారంభించాను, సహజమైన అభిమానంతో: "నిజంగా మీకు బోధపడి వుండకపోతే తప్పక చెపుతాను, ఎన్నిసార్లయినాసరే, మీకు బోధపడేవరకూ చెపుతాను. కాని మీరు ఏ రోజు చెప్పినపాఠాలు ఆ రోజు చదువుతూ వుండాలి. అట్లా చదివేవాళ్ళు ఫెయిలవడం అంటూ వుండదు. అసలు, తరగతిపుస్తకాలే కాదు: కొన్ని పై పుస్తకాలుకూడా చదవాలి. గొప్ప గ్రంథాలున్నాయి. మీరంతా అవి చదవాలి. చదివి వాటిలోని సారం గ్రహించి ఔన్నత్యం పొందాలి. దేశానికి కీర్తి తీసుకురావాలి" ఆ మాటలలో వుండే నిజమైన అభిమానం, వుద్రేకం ఆ విద్యార్థులను ఆకర్షించాయి. వారికి నాలో కొంత విశ్వాసం కలిగింది. ఆ పిల్లకూడా ముగ్ధురాలై చూస్తూంది ఈ కొత్త మేష్టరుగారికేసి!

౨

నెలరోజులు గడిచాయి. నా పాఠాలు చెప్పే పద్ధతి ఆ పిల్లలకు బాగా నచ్చింది. నే నెప్పుడు క్లాసుకు వస్తానా అని ఎదురు చూస్తున్నారు. ఇదంతా నేను కాస్తోకూస్తో వాళ్ళ మనస్తత్వాన్ని అనుసరించడంవల్లనే అని నాకు తెలుసు. "మేష్టరుగారూ! ఈ రోజు పాఠం వద్దండి. కోర్సు అయిపోవచ్చిందికదా! ఏమైనా మంచి విషయాలుగురించి చెప్పండీ!" అని పట్టుపట్టేవారు ఒకొక్కప్పుడు. అట్లాంటప్పుడు వాళ్ళ మనసు నొప్పించకుండా ఏ ఆకర్షణీయమైన సంగతో కథో చెప్పి రంజింపజేసేవాణ్ణి. అందుచేత వాళ్లు నామీద చాలా ప్రేమ చూపించేవాళ్లు!

ఆ పిల్లకుగూడా నామీద గౌరవం ఎక్కువైపోతోంది. స్వాతివానకు ముత్యపుచిప్పమల్లే ఎదురు చూస్తోంది నే నేమి చెప్తానా అని. ఏమి చెప్పే అది అక్షరాలా చేసేస్తోంది. పిచ్చి పిల్ల! ఒక

నాడు నేను అన్నాను, మాటవరసకే అనుకోండి; "ఇవి చాలా చక్కని పద్యాలు. ప్రతి పదం లోనూ తేనె చిప్పిల్లుతోంది. రేపు ఉదయానికి ఇవి కంఠతా పట్టేస్తే నాకు చాలా ఇష్టం" అని. ఆ మాట పట్టుకుంది. ఇంటికి పోయి రాత్రల్లా చదూతూ కూర్చుందట, టీ పెట్టుకుని మరీ. తెల్లవారేసరికి పాపం! బొడ్డకాయల్లాగా వాచిపోయి వున్నాయి కళ్లు! కళ్లంబడి, ముక్కుంబడి నీళ్లు! చిన్న వృష్ఠం! ఆ పద్యాలన్నీ వొప్పచెప్పేసింది. పసివాళ్లు వాడిపోయిన ఆ కోమలదేహాన్ని చూసేసరికి నాకు ఎంతో జాలివేసింది! ఎంతో బాధ కలిగింది. ఏం చెయ్యగలను!

౩

లలిత! ఆమె పరిస్థితి రానురాను మారుతోంది చిత్రంగా. క్లాసులో నేను పాఠం చెప్పేటప్పుడు ఆమె కళ్లు నిండుగా అనుభవిస్తున్నట్టుంటాయి. నన్నూ నా పలుకుల్నీ తన ప్రాణాలన్నీ నా మీదనే పెట్టుకున్నట్టు చూస్తుంది నాకేసి. ఏదన్నా సందేహం కలిగితే దగ్గరకువచ్చి కళ్ళల్లో కళ్లుపెట్టి ప్రశ్నిస్తుంది మృదువుగా. ఇదంతా నాకు చాలా బాధ కలిగిస్తోంది! బాధ! తియ్యని బాధ! వాంఛనీయమైన బాధ! కాని ఎట్లా? ఏం చెయ్యను? ఆ సుకుమార హృదయాన్ని ఆ అపురూప వరాన్ని ఏమి చేసుకోడమా అని ఆలోచించేవాణ్ణి వెర్రిగా.

౪

నా పుస్తకాలంటే ఆమెకి చాలా ప్రేమ. ఎంతో ఆప్యాయంగా చదువుతోంది. ఇప్పుడిప్పుడు మా యింటికి కూడా వస్తోంది పుస్తకాల కోసం! ఇట్లా ఆమె నాతో చనువుగా వుండడం చూసి తోడి ఉపాధ్యాయులు కొందరు ఈర్ష్య పడుతున్నారు పాపం!

౫

ఒకనాడు సాయంత్రం ఒక్కణ్ణీ కూర్చున్నాను, బీచిని. పిల్లవాయువులు ఇసుకతిన్నెలమీద ఆడుకుంటున్నాయి! సముద్రం అలలతో తీరాన్ని తాకుతోంది పదేపదే. సాయంత్రపు బంగారు కాంతులు అలలమీద అలముకుంటున్నాయి. ఈ మెత్తని కిరణాల్ని చూస్తే లలితే జ్ఞాపకమొస్తోంది! ఏమిటీ ఈ ఆకర్షణలూ ఈ బాధలూను?



లలిత అంటే నాకెందు కింత ఆకర్షణ?

ఆమె గాలి సోకితే నా హృదయం ఝల్లుమంటోంది.

ఆమె సోగకళ్ళలో ఆ తేజస్సు నాకే అట్లా కనబడుతోందా? అందరికీనా?

ఆమెతో మాట్లాడేటప్పుడు పలుకులు తొట్రుపాటు పడడమూ గుండె కొట్టుకోవడం ఎందుకో! ఆమె నా కళ్ళల్లోకి చూసి నన్ను బాధపెట్టడం, ఏమి కోరి?

ఏమిటో యిదంతా!...

...ఏమిటిదీ? నాకు! నాలాంటి వ్యక్తికి! ఇట్లాంటి వూహాలేమిటీ? లాభంలేదు. కుటుంబాన్ని తెచ్చేయ్యాలి. పదిమందిలోనూ శాస్త్ర గౌరవంగా బ్రతుకుతున్న నాకు ఏమిటీ తలపులూ?

తొందరపడి నేనేమైనా తప్పుగా నడిస్తే నా మర్యాద ఏమౌతుంది? నన్ను తన ప్రాణంలాగా చూసుకునే నా భార్య ఏమనుకుంటుంది? ఆ పిల్ల జీవిత మేమౌతుంది? నేను! ఆదర్శప్రాయంగా వుండవలసిన నేను! మహాపురుషుల జీవితాల్ని ఎన్నో మననంచేసుకున్న నేను!! ఇట్లాంటి తుచ్ఛవాంఛలో పడడమా? ఎంతమాత్రం పడకూడదు.

ఇదంతా మనస్సుయొక్క ప్రభావం! దాన్ని జయించాలి! ఎట్లానైనా జయించాలి! తప్పదు! బుద్ధభగవానుడూ- వివేకానందా-ఆనందస్వరూప్ వీళ్ళంతా ఎట్లా జయించారు మనస్సుని? తీవ్ర ప్రయత్నంచేతనే కదా!

కొంచెందూరంలో లలిత కనబడుతోంది! నా మనస్సు పెనుగులాడుతోంది! ఊపిరి లోనికి నిండుగా తీసుకున్నాను మనోబలంకోసం!-కాస్త బిగువుగా కూర్చున్నాను!

ఆమె సమీపించింది సహజమైన చిరునవ్వుతో! "ఏం! మేష్టారూ! ఒక్కరూ కూర్చున్నారు?" ప్రశ్నించింది. "ఊరకనే" అన్నాను ఆలోచిస్తూ. ఆమె కొద్దిదూరంలో కూర్చుంది. ఎడమ చేత్తో ఇసుక తీసి జల్లుకుంటోంది కొంచెం కొంచెంగా ఆ సంజ బంగారు కాంతుల్లో ఆ అందాలపిల్ల ఒక దేవకన్యలాగా కనబడుతోంది! మనస్సును నొక్కిపెడుతున్నాను!

"ఆమె యెంత అందంగా వుంది" అని నా మనస్సు!

— జోస్యానికి ధాకలా! —



"నీవు కలెక్టరంతటివాడివౌతావని నీ జాతకం చూసి ఒక జ్యోతిష్కుడు చాలాకాలం క్రిందట చెప్పాడు, గాని ఇంతవరకూ నీవొక గుమాస్తావైనా అవకుండా తిరుగుతున్నావు."

"నాన్నగారూ! ఆ జోస్యం యథార్థమేనండి, నేను రేపే మన ఊరి మ్యునిసిపాలిటీలో బిల్ కలెక్టరు ఉద్యోగం స్వీకరిస్తున్నానండి."

"అవును. అద్భుతమైన సౌందర్యం పూజించతగినది" అని నేను!!

ఆ జవాబును పురస్కరించుకుని, "ఆమెను వశ్యం..." మనస్సు!

"వశం చేసుకుని ఏం చేస్తావు? పీల్చి పిప్పి చేస్తావు? ఇంత ఆదర్శస్వప్నమూ మాయ మౌతుంది! అప్పుడు?—మరొక అందమైన స్త్రీ కోసం!—అంతేగదూ?" నేను.

లలిత-నా కళ్ళలోకి ఏదో ఆలోచిస్తున్న నా కళ్ళలోకి-చూస్తోంది!

ఏవో సమస్యలతో పోరాడుతున్న నేను ఆమెకు వింతగా కనిపిస్తున్నాను కాబోలు!

బహుశః, ఆమెకు నాతో ఏమి మాట్లాడాలో తెలీలేదు.

చంద్రుడు మెల్లగా సముద్రంలోంచి బయటికి వొస్తున్నాడు! ప్రకృతిశోభ దివ్యంగా వుంది! ప్రకృతిలో క్షణక్షణమూ నూతన కాంతులతో దర్శనమిచ్చే ఉన్నత సౌందర్యాన్ని ఆరాధించరాదా? ఇట్లా వొక అమాయిక బాలికపై విరుచుకు పడకపోతే! ఆ వెన్నెల చిక్కదనం కలిగించే మైకమూ ఆమె సౌందర్యం కలిగించే ఆక

[illegible] — ఆ [illegible] ...లని వెనుగులాడుతున్నాను నేను !!

"మేష్టారూ!" తియ్యని వుత్కంఠ తొణికిసలాడుతోంది ఆమె కంఠంలో !

నిగ్రహశక్తికోసం వివేకానందుడి రూపాన్ని భావించుకుంటున్నాను ! ఆమెవేపు చూశాను, గంభీరంగా !

ఆమె యెంతో ఆశ్చర్యంతో నావేపు చూస్తోంది !!

వెన్నెల ! పండువెన్నెల ! సృష్టి మలినమంతా క్షాళనచేసే వెన్నెలవర్షం ! అమృతవర్షం !

"అమ్మాయీ ! సాయంత్రమయింది. వెళ్ళిపోదాము" అంటూ లేచి నిల్చున్నాను. ఆమె కూడా లేచింది సగం అయిష్టంతో.

ఒక్కమాటకూడా లేదు. ఇద్దరమూ నడుస్తున్నాము. మా యిల్లు వచ్చింది. తలుపు తీశాను. ఆమెకూడా వచ్చింది. లైటు వెలిగించాను. ఇద్దరమూ కూర్చున్నాము. టేబిలుమీద వున్న వుత్తరం చూసింది. "ఎక్కడేనుంచండీ వుత్తరం?" అంది లలిత నా గంభీరతను భేదిస్తూ. "చదువు తెలుస్తుంది" అన్నాను, త్వరలో ఆలోచన ముగించి.

ఆమె మనసులో ఇట్లా చదువుకుంది:

"ప్రియమైన భర్తగారికి నమస్కారములు. చాల రోజులనుంచీ మీ క్షేమం తెలియలేదు. ఎంతో ఆందోళనగా వుంది.

ఇవాళ కామేశం వచ్చాడు. మిమ్మల్ని చూసినట్టు కూడా చెప్పాడు. నాకు చాలా విచారం కలిగింది.

ఎందుచేత అట్లా నీరసించిపోయారు? నాకు ఆ విషయమై వొక్కమాట అయినా వ్రాయలేదేమి?

మీరు ఎప్పుడూ అంతే. నేను కాస్త దూరంగా వుంటే ఎందుకూ పనికిరారు. తుదకు వేళకు భోంచెయ్యడంకూడా తెలియదు. స్వంత ఆకలి కూడా ఎరగని మిమ్మల్ని ఏమనాలో నాకు తెలియదు. మళ్లా రోజూ స్కూల్లో బోధిస్తానే వుంటారు. ఆరోగ్యశాస్త్రమనీ అదనీ. ఏం లాభం?

జాగ్రత్త. మీ పుణ్యముంటుంది. భోజనం మాత్రం వేళపట్టున చెయ్యండి. పాలు వాడిక మానకండి. మరింత చిక్కిపోతారు, ఆరోగ్యం ఎట్లా కాపాడుకుంటారో మరి, నే వచ్చేవరకూ.

రాత్రులు తెల్లవార్లూ మేలుకుని వుంటున్నారటగా కథలూ అవీ రాసుకుంటూ? వద్దు బాబూ అసలు ఎంతచెప్పినా మీకీబుద్ధి మళ్ళదు గావును! ఇదుగో చెప్తున్నా; నామీద వొట్టువేసుకుని. మీరు వేళకి పడుకోకపోతే నన్ను చంపుకు తిన్నట్టే!

ఇక్కడ వున్నానన్నమాటేగాని నా ప్రాణాలన్నీ మీమీదనే వున్నాయి. ఇంకా ఇక్కడ నెల్లాళ్ళుండాలంటున్నారు వీళ్ళు, ఆరోగ్యం సిరపడడానికి. కాని నేను వుండను. పది రోజుల్లో వచ్చేస్తున్నాను.

బెంగపడకండి; నే నారోగ్యంగానే వున్నాను. వెంటనే జాబు వ్రాస్తారు కదూ? మీనుండి వుత్తరం వచ్చేవరకూ నా గుండె కుదుటుపడదు సుమండీ.

ఇట్లు,......"

అదీ— ఉత్తరం ! ఇప్పుడు ! అయ్యో ! బహుశః లలిత హృదయంమీద తీవ్రమైన వొక దెబ్బ తగిలివుంటుంది !

ఆమె ముఖం పూర్తిగా కాంతివిహీనమైంది !

"ఇన్నాళ్లూ మేష్టరుగారు వొక్కరే. ఉత్సాహవంతులైన యువకులు ! కోమల హృదయులు! ఎంతో ఆకర్షించేవారు !!

కాని ఇప్పుడు ?

ఆయన వివాహితుడు. ఆయనను అమితంగా ప్రేమించే ఒక స్త్రీ హృదయం వుంది ! ఆయనలోని ఆకర్షణలన్నీ ఆ హృదయవికసనంకోసం !

అమ్మ ! నయం !! ఆ విషయం ఇప్పుడైనా తెలిసింది !...అయినా ఏం లాభం?..." అంటున్నాయి, ఆమె కళ్ళు !!

ముచ్చెమటలు పోసిపోయి వెనక్కి చేరబడిపోయింది !— ఆ సుకుమారహృదయం లలిత !!

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras, and published by V. KALIDAS, at 12 Thambu Chetty Street, Madras.
Editor: V. KALIDAS, Associate Editors : Andra Seshagiri Rao, B.A. Mudda Viswanadham